క్లుప్తంగా

సత్తుపల్లికి చేరిన సీయూ, వీవీ ప్యాట్స్



సత్తుపల్లిలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచి సీల్ వేస్తున్న అధికారులు

సత్తుపల్లిటౌన్: పార్లమెంట్ ఎన్నికల నిర్వాహణ కోసం సత్తుపల్లి నియోజకవర్గానికి కంట్రోల్ యూనిట్(సీయూ), బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్స్ ఆదివారం రాత్రి సత్తుపల్లి స్ట్రాంగ్‌రూంకు చేరాయి. 364 సీయూ, బ్యాలెట్ యూనిట్లు, వీటిలో పాటు 411 వీవీ ప్యాట్స్‌ను జ్యోతి నిలయం స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. అనంతరం స్ట్రాంగ్‌రూంకు సీల్ వేసి సాయుధ బలగాలతో పహారా ఏర్పాటు చేశారు. కల్లూరు ఆర్డీఓ ఎల్.రాజేందర్‌గౌడ్, ఏసీపీ రఘు, తహసీల్దార్ యోగేశ్వరరావు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు బెస్ట్ ఈఎంటీ అవార్డు



అవార్డు తీసుకుంటున్న సత్యనారాయణ

కారేపల్లి: మండల పరిధిలోని శాంతినగర్ గ్రామానికి చెందిన బూదూరి సత్యనారాయణ 108 అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషన్ (ఈఎంటీ)గా హైదరాబాద్ జిల్లాలో 108 అత్యవసర సేవలు అందిస్తున్నారు. కాగా.. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ వ్యవస్థాపకుడే ఎంఏ ఖలీద్, డైరెక్టర్ వెంకటేశం చేతుల మీదుగా రాష్ట్ర స్థాయిలో బెస్ట్ ఈఎంటీ అవార్డును సత్యనారాయణ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ జాన్ షాహెద్, రత్నంను పాల్గొని, సత్యనారాయణను అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం

బోనకల్: మండలంలోని తహసీల్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆర్ఐ లక్ష్మణ్ నాయక్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఎండల దృష్ట్యా కార్యాలయాలకు వచ్చే ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం

చింతకాని: మండల కేంద్రంలోని తహసీల్ ఎదురుగా ఉన్నటువంటి శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో దేవాదాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తోటకూరి వెంకటేశ్వరరావు రూ.45 వేల వ్యయంతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరు, విద్యుత్ మోటార్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును గ్రామస్తులు అభినందించారు. గ్రామపెద్దలు బండి సైదేశ్వరరావు, మల్లెల వెంకటేశ్వర్లు, దండా విశ్వనాథం, మరిగండి బస్వయ్య, వడ్రాణపు రామయ్య, దేశబోయిన వెంకటేశ్వర్లు, పోతనబోయిన వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు ఫణిహారం శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

ఐరన్‌బెడ్లు వితరణ

ఏన్కూరు: స్థానిక గురుకుల విద్యాలయానికి పూర్వ విద్యార్థి అంకం ప్రవీణ్‌కుమార్ ఐరన్ బెడ్స్ వితరణ చేశాడు. 1999–2000లో పదో తరగతి చదివిన అంకం ప్రవీణ్‌కుమార్ రూ.2.50 లక్షల విలువగల 15 ఐరన్‌బెడ్లను ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డికి అందించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుటుంబరావు, విశ్వేశ్వరావు, స్వప్న, పూర్వ విద్యార్థులు రుద్రాక్షల నాగాచారి, బీరెల్లి పరమేష్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

'హమాలీ'ల కూలి పెంచాలి

తల్లాడ: గ్రానైట్ ప్యాక్టరీల్లో, మార్బుల్ షాపుల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికుల కూలీ పెంచాలని ప్రగతిశీల హమాలీ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి డి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం తల్లాడలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తక్షణమే వేతన ఒప్పందం జరగకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డి.రమణ, పటాన్ నాగుల్‌మీరా, రాఘవ రామకృష్ణ, వెంకటేశ్వర్లు, రాఘవరావు, నరేష్, రవి, శ్రీను, కృష్ణయ్య, నాగేశ్వరరావు, కొండల్ పాల్గొన్నారు.

సహకారం అందించండి

బోనకల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదుకు సహకారం అందించాలని హెచ్ఎం రామకృష్ణ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంను సోమవారం నిర్వహించి మాట్లాడారు. 5సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరిని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కొంగర బేబి, హెల్త్ సిబ్బంది శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా..

బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో బోనకల్ క్రీడాకారుల సత్తా

- వేసవిలో ప్రతిరోజు శిక్షణ
- బోనకల్ నుంచి 300 మంది
- ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు వర్తింపు
- శిక్షణ ఇస్తున్న కోచ్ అమిరేశి లింగయ్య



బాల్‌బ్యాడ్మింటన్ సాధన చేస్తున్న క్రీడాకారులు



క్రీడాకారులతో కోచ్ అమిరేశి లింగయ్య

బోనకల్: బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బోనకల్ క్రీడాకారులు రాణిస్తున్నారు. ఒక్క బోనకల్ మండలం నుంచే 300 మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా కోచ్ అమిరేశి లింగయ్య తయారు చేశారు. బోనకల్ అంటే బాల్‌బ్యాడ్మింటన్‌కు మారుపేరుగా నిలిచింది.

పూర్వ వైభవం కోసం..

పాశ్చాత్య క్రీడల మోజులో గ్రామీణ క్రీడలు కనుమరుగవుతున్న ఈ రోజుల్లో బాల్‌బ్యాడ్మింటన్‌కు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు అహర్నిషలు కృషి చేస్తున్న కోచ్ లింగయ్యను అందరూ అభిమానిస్తున్నారు. బాల్‌బ్యాడ్మింటన్‌పై ఆసక్తి కలిగిన వారిని చేరదీసి ప్రతిరోజు క్రీడా నైపుణ్యం నేర్పుతున్నారు.

సత్తా చాటిన బోనకల్ క్రీడాకారులు..

స్టార్‌ఆఫ్‌ఇండియా క్రీడాకారులుగా 10 మంది క్రీడాకారులను, 4 ఆలిండియా బెస్ట్ ప్లేయర్లుగా అవార్డులు కూడా దక్కాయి. ఇప్పటి వరకు జరిగిన 42వ సబ్ జూనియర్ జాతీయస్థాయి పోటీల్లో 6సార్లు సత్తాచాటిన ఘనత బోనకల్ క్రీడాకారులకు ఉంది.

- ఇటీవల నేపాల్‌లో జరిగిన సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ అంతర్జాతీయ పోటీల్లో బోనకల్‌కు చెందిన భూక్యా ఉమ చాంపియన్‌షిప్ సాధించింది.
- 2020 స్కూల్ గేమ్స్‌లో బోనకల్ క్రీడాకారులు కైవసం చేసుకున్నారు.
- 2021లో మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో జరిగిన సీనియర్ చాంపియన్ షిప్‌లో పోటీలలో మహిళా జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. అదే ఏడాది జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికల జట్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. 66వ జూనియర్ రాష్ట్రస్థాయి బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది.
- 2022లో హైద్రాబాద్‌లో జరిగిన 67వ సీనియర్ రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో మహిళా జట్టు ప్రథమ స్థానాన్ని సాధించింది.
- 2023 గోదావరిగని జరిగిన 68వ సీనియర్ రాష్ట్ర చాంపియన్ షిప్‌ను సైతం మహిళా జట్టు సాధించింది.
- గతేడాది బోనకల్‌లో జరిగిన జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు విజయం సాధించింది. నిజామాబాద్‌లో జరిగిన 41వ సబ్ జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో బోనకల్ క్రీడాకారులు ప్రథమ స్థానాన్ని సాధించారు. అదేవిదంగా ఆర్మూర్‌లో జరిగిన 42వ రాష్ట్ర చాంపియన్ షిప్ పోటీల్లో బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది.

ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు..

బాల్‌బ్యాడ్మింటన్ క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాంపియన్ షిప్ సాధించిన క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ వర్తింపు జరుగుతుది. రాష్ట్రస్థాయిలో కూడా ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ వర్తింపు చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు. కొత్తతరం క్రీడాకారులను తయారు చేసేందుకు ముష్టికుంట్ల గ్రామానికి చెందిన కోచ్ అమిరేశి లింగయ్య వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తూ ఆటల్లో మెలకువలను నేర్పిస్తున్నారు.

క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నా..



బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రతీ ఏటా కొత్తతరం క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నాను. గత 30ఏళ్లుగా అనేక మంది క్రీడాకారులను తయారుచేసిన సంతృప్తి మిగిలింది. అనేక మంది క్రీడాకారులకు ఉద్యోగాలు రావడం సంతోషం.
– కోచ్ అమిరేశి లింగయ్య

చదువుతో పాటు క్రీడల్లో రాణించా..



మాది నిరుపేద కుటుంబమైన నేను చదువుతో పాటు క్రీడల్లో రాణించాను. ఈ మేరకు నాకు కొత్తగూడెం పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చింది. ఉదయం కూలీ పనులు, సాయంత్రం సాధన చేయడంతో ఈ అవకాశం దక్కింది.
– బి.ఉపేంద్ర, బోనకల్

పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చింది..



రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి.. 10 చాంపియన్ షిప్‌లను అందుకున్నాను. నా ప్రతిభను గుర్తించి ఉత్తరాఖండ్‌లో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో జాబ్ కూడా వచ్చింది.
– బి.గోపి, బోనకల్

వర్షాలకు కూలిన రేకుల ఇళ్లు



ఇంటిపై కప్పు కూలిపోవటంతో నిరాశ్రయులైన బాధిత కుటుంబం

కారేపల్లి: ఆదివారం రాత్రి వీచిన గాలిదుమారం, భారీ వర్షానికి కారేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో రేకుల ఇళ్లు కూలిపోయాయి. ఇంటిపై ఉన్న రేకులు గాలి బీభత్సానికి ఎగిరిపోయాయి. కారేపల్లిలోని బీసీ కాలనీకి చెందిన బట్టు చంద్రకళ ఇంటిపై కప్పు ఎగిరిపోవటంతో.. బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వచ్చింది. దీంతో పాటు, రావోజీతండా గ్రామానికి చెందిన మాలోత్ లక్ష్మి ఇంటిపై కప్పు రేకులు ఎగిరిపోవటంతో పాటు, సిమెంట్ గోడ సైతం కూలిపోయింది. కారేపల్లి వెంకటసాయి నగర్‌లో సిమెంట్ బ్రిక్స్ వద్ద రేకుల ఇళ్లు కుప్పకూలిపోయింది. గాలి బీభత్సానికి మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. విద్యుత్ తీగలు తెగిపడటంతో ఆయా గ్రామాల్లో రోజంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

సంకల్ప సభను జయప్రదం చేయండి

ముదిగొండ: తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఖమ్మం ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెషన్ హాల్‌లో నిర్వహించే సంకల్ప సభను జయప్రదం చేయాలని తెలంగాణ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కొరకొప్పు రామారావు అన్నారు. మండలపరిధిలోని కమలాపురం సాయిమెరిట్ స్కూల్ టీచర్స్‌తో కలిసి సంకల్ప సభ కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో సాయిమెరిట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సూరంపల్లి వెంకటేశ్వర్లు, ముదిగొండ మండల అధ్యక్షులు భూక్య నాగబిక్షం, శ్రీనివాస్‌రావు, సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడికి కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి

ఎర్రుపాలెం: ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆ పార్టీ తెలంగాణా రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన ఓ ఉద్యమకారుడిని ప్రకటించాలని తెలంగాణా మాజీ జేఏసీ మండల కన్వీనర్ కర్నాటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థి ఎంపికలో మల్లగుల్లాలు పడుతున్న కాంగ్రెస్ అధిష్టానం ఉద్యమ కారుడికి ఎంపీ సీటు ఇస్తే పార్టీకి కూడా ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కాంగ్రెస్ నాయకుడు ఉద్యమకారుడికి టికెట్ ఇచ్చే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

వృత్తిలో బదిలీలు సహజమే..

ఏన్కూరు: వృత్తిలో బదిలీలు సహజమేనని హెచ్ఎం పాండురంగయ్య తెలిపారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదవీరమణ చేయనున్న ఏన్కూరు లైబ్రేరియన్ తొండపు రామకృష్ణకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ.. పదవీరమణ పొందిన తరువాత సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునులు సీహెచ్ చంద్రిక, సుబాషిణి, ఎన్ సత్యావతి, నిర్మల, లత, అన్నపూర్ణ, అకిత పాల్గొన్నారు.

సీపీఐ ఎంఎల్ వ్యవస్థాపక దినోత్సవం



వైరాలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మాస్‌లైన్ నాయకులు

వైరా: సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం వైరాలోని విక్రమ్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఎలదండి బాబు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు సీవై పుల్లయ్య, కె.అర్జునరావు, దర్గయ్య, నాగులు, శ్రీనివాసరావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించాలి

ఏన్కూరు: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని, ఆర్ఎస్ఎస్‌ను ఓడించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు ఎస్కె లాల్‌మియా కోరారు. మండలంలోని రాజలింగాలలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ పాలనలో దేశసంపదను కార్పొరేట్లకు దోచి పెడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, రాము, నాగేశ్వరరావు, శ్రీను, కృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు

కారేపల్లి: ద్విచక్రవాహనం వెనక వస్తున్న కారు అదుపుతప్పి ఢీకొట్టడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని భాగ్యనగర్‌తండా గ్రామానికి చెందిన భూక్యా రవి సోమవారం ద్విచక్రవాహనంపై కారేపల్లి వైపు వస్తున్నారు. అదే సమయాన కొమరారానికి గ్రామానికి చెందిన భూక్యా ప్రశాంత్, గుగులోతు జగదీష్ కారులో ఇల్లెందు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్నారు. గాజుల తండా వద్ద కారు అదుపుతప్పి ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి ఢీకొట్టడంతో రవికి తీవ్ర గాయాలు కాగా ఖమ్మం తరలించారు.

కేసు నమోదు

చింతకాని: మండల పరిధిలోని సీతంపేట గ్రామంలో మైనర్ బాలికను ఓ యువకుడు లైంగికంగా వేధిస్తుండటంతో బాలిక తల్లి చేసిన ఫిర్యాదు మేరకు సోమవారం అతనిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

నష్టపరిహారం చెల్లించాలి

కారేపల్లి: మండలంలోని మాధారం డోలమైట్ మైన్ టౌన్‌షిప్‌లో మేతకు వెళ్లిన గుంపెళ్లగూడెం గ్రామానికి చెందిన ఆంబోతు టౌన్‌షిప్ సెప్టిక్ ట్యాంకులో పడి మృతి చెందిన సంగతి తెలిసిందే. కాగా.. సోమవారం గుంపెళ్లగూడెం గ్రామస్తులు ఆంబోతు చనిపోవటానికి టౌన్‌షిప్ మైనింగ్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని.. నష్టపరిహారం చెల్లించాలని టౌన్‌షిప్ ముందు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో టౌన్‌షిప్‌లో ఉన్న ఉద్యోగస్తుల కుటుంబాలు కొత్త ఆంబోతు కొనుగోలుకు సహకరిస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణ

సత్తుపల్లిరూరల్: సింగరేణి ఆధ్వర్యంలో సత్తుపల్లి ప్రాంతం నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణ అందించబడుతుందని జీఎం షాలెం రాజు తెలిపారు. సింగరేణి ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాల నిరుద్యోగులు ఈ కోర్సులపై ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 38 వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇవ్వబడుతుందని ఇందులో కాస్మోరాలజీ, డ్రోన్ టెక్నీషియన్, సోలార్ టెక్నీషియన్, సెల్ టెక్నీషియన్, టూ వీలర్ మెకానిక్, ఆర్‌కె గ్యాష్ వెల్డింగ్, కంప్యూటర్ డీటీపీ ఇంటర్నెట్ ఆఫ్‌థింగ్స్ కోర్సుల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని కోరారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

సత్తుపల్లి: సత్తుపల్లిలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరామయ్య తెలిపారు. నాన్‌మైనార్టీ విద్యార్థులకు ఈ నెల 24న ఉదయం 11 గంటలకు లక్కీడ్రా ద్వారా రిజర్వేషన్ నియమావళి ప్రకారం బీసీ–10, ఎస్సీ–5 ఎస్టీ–3, ఓసీ–2 సీట్లకు ఎంపిక చేయబడుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తల్లిదండ్రులతో కళాశాలకు చేరుకోవాలని కోరారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు



సీటు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, యూత్‌క్లబ్ సభ్యులు

తల్లాడ: మండలంలోని మల్లవరం ప్రాథమిక పాఠశాలకు చెందిన పదిమంది విద్యార్థులు తెలంగాణా గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశ అర్హత పరీక్షలో సీటు సాధించారు. పాఠశాల నుంచి 11 మంది పరీక్ష రాయగా.. పదిమంది అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రసన్నకుమార్, వంశీ, యశ్వంత్, రిషి, అక్షయ, క్రిషిత, ఆరాధ్యలాస్య, కుసుమలత, చంద్రిక, రమ్యశ్రీ లను.. పాఠశాల హెచ్ఎం పద్మజా, దాసరి వీరభద్రరావు యూత్ క్లబ్ అధ్యక్షులు దుగ్గిదేవర అజయ్‌కుమార్, గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణారావు అభినందించారు. ఉపాధ్యాయులు బి.హరిబాబు, కె.వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా..

- మోదీ పథకాలకు ప్రజల్లో మంచి ఆదరణ
- బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు



కొణిజర్ల : రోడ్ షోలో అభివాదం చేస్తున్న బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

కొణిజర్ల/ఏన్కూరు/బోనకల్/కల్లూరు: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా తనను గెలిపిస్తే పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని తాండ్ర వినోద్‌రావు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ రుక్మారావులతో కలిసి కొణిజర్లలో సోమవారం ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈసందర్భంగా కమలం పూవు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అలాగే, ఏన్కూరులో సాయిబాబా దేవాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంతేకాక బోనకల్ జరిగిన సభ, ర్యాలీలో కూడా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో కలిసి పాల్గొన్న వినోద్‌రావు మాట్లాడారు. కేంద్రంలో మోదీ నేతృత్వాన అమలుచేస్తున్న పథకాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. కేంద్రంలో మరోమారు బీజేపీ అధికారంలోకి రానుండగా, ఖమ్మంలో తనను గెలిపిస్తే జిల్లా అభివృద్ధికి బాటలు పడతాయని తెలిపారు. ఇక కల్లూరులో జరిగిన ప్రచారంలో భాగంగా మాజీ జెడ్పీటీసీ డాక్టర్ లక్కినేని రఘును కలిసిన వినోద్‌రావు ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమాల్లో నాయకులు శ్యాంరాథోడ్, నంబూరి రామలింగేశ్వరరావు, కోటేశ్వరరావు, నరేష్, మల్లికార్జున్, కిరణ్, దరియాసింగ్, నెల్లూరు కోటేశ్వరరావు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, కొవ్వూరి నాగేశ్వరరావు, నల్లమోతుల రమేష్, దొడ్డ అరుణ, చావా కిరణ్, నరుకుల వెంకటేశ్వర్లు, దొంతు జ్వాలా నర్సింహారావు, బోళ్ల బిక్షపతి, గుగులోతు నాగేశ్వరరావు, సురేష్, నాయుడు రాఘవరావు, భాస్కర్ల వీరంరాజు, గుండపనేని అనీల్, తుమ్మలపూడి పుల్లారావు, జంగాల శివకుమార్, పసుపులేటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వరి పంట కోత ప్రయోగం



దిగుబడిని పరిశీలిస్తున్న అధికారులు

పెనుబల్లి: మండలంలోని గౌరారం గ్రామంలో స్థానిక రైతు శ్రీనివాసరెడ్డి సాగు చేసిన వరి పంటను హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ అధికారుల బృందం సోమవారం పరిశీలించారు. పంట పొలంలో 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు విస్తీర్ణంలో పంట కోత ప్రయోగం చేశారు. ఈ ప్రయోగంలో 9,760 కిలోల పంట దిగుబడి వచ్చిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అర్థ గణాంక శాఖ అధికారులు రామభద్రం, ఉపగణాంక అధికారి కె.వెంకట్రావు, గణాంక అధికారి కె.వెంకటేశ్వర్లు, ఉపగణాంక అధికారి శ్రీకాంత్, మండల గణాంక అధికారి రఘు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ నవ్యకాంత్

కల్లూరు: కల్లూరు బస్టాండ్‌లో సత్తుపల్లి, కల్లూరు ప్రభుత్వ వైద్యశాలలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వ వైద్యాధికారి నవ్యకాంత్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణ సమయంలో ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు పిల్లలు, వృద్ధులు, గర్భిణులు తప్పని సరిగా ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని సూచించారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని దగ్గర ఉంచుకుని ప్రయాణం చేయడం వల్ల డీహైడ్రేషన్ అవ్వకుండా కాపాడుకోవచ్చునన్నారు. నాలుగు చెంచాల పొడిని ఒక లీటరు నీటికి కలిపి ఓఆర్ఎస్ ద్రావణాన్ని తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీబీఓ కిన్నెర ఆనందరావు, ట్రాఫిక్ గైడ్ వెంకటేష్, ప్రయాణికులు, ఆర్‌టీసీ సిబ్బంది పాల్గొన్నారు.


ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



అమ్మపాలెంలో బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహిస్తున్న పూజారులు

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెంలో సోమవారం శ్రీ సీతారామచంద్ర స్వామి వార్లు, వీరాంజనేయ స్వామి, శివాలయ శిఖర ధ్వజ, శీతల పరమేశ్వరి (బొడ్రాయి) ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం తెల్లవారు జాము నుంచే వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఉదయం 10.44 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ జీవ ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. అనంతరం సీతారాముల శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమ్మపాలెంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ



ముత్యాలమ్మ, పోతురాజులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

కారేపల్లి: మండలంలోని భాగ్యనగర్‌తండా, పాతకమలాపురం గ్రామాల్లో సోమవారం బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ముత్యాలమ్మలను ప్రతిష్ఠించటం, పాతకమలాపురంలో శ్రీఅభయాంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా జరిగాయి. దీంతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణాన్ని సంతరించుకోవటంతో పాటు, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలో నిర్మించిన శ్రీదాసాంజనేయస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ ఈ నెల 26న నిర్వహించనున్న సందర్భంగా సోమవారం యాగశాలలో పూజా కార్యక్రమాలు అత్యంత వైభవోతంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామున భక్తులు ఆలయం అంతటా, గ్రామ పొలిమేరల్లో మామిడి తోరణాలు కట్టారు. యాగశాలలో గణపతి పూజ, పుణ్యహవచనం, దీక్షాధారణ, ద్వార పూజలు, అఖండ స్థాపన, వాస్తు హోమం, వాస్తు పూజ, అగ్ని మధనం, అగ్ని ప్రతిష్ఠ, దేవతల ఆవాహనం, చతుర్వేద పారాయణం తదితర పూజా కార్యక్రమాలను గ్రామ పురోహితులు కొత్తూరి రాజేష్ నిర్వహించారు.


వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో..

ముదిగొండ: మండలపరిధిలోని అమ్మపేటలో స్వయంభుగా వెలసిన వెలగొండ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో ప్రధాన అర్చకులు గుంటూరు పవనాచార్యులు స్వామివారికి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామికి పెండ్లికు మారుడుగా చేయట, విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచన, అంఖడ దీపారాధన, రుత్విగ్వరణ, అంకురారోహవణ, స్వామివారి ఎదుర్కోలు మహోత్సవం పూజలు నిర్వహించారు. నేడు నిర్వహించే స్వామివారి కాల్యాణంలో పలు గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

సదాశివునిపేటలో అమ్మవార్ల తిరునాళ్లు

సత్తుపల్లిరూరల్: మండలంలోని సదాశివునిపేట శ్రీఅంకమ్మతల్లి, శ్రీమహాలక్ష్మితల్లి తిరునాళ్ల మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కాగా రాత్రి అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం జరిగింది. సోమవారం మైలపట్నం, అమ్మవారికి అభిషేకాలు, గుడి బండి, పుట్ట బంగారం కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 25వ తేదీ గురువారంతో తిరునాళ్ల మహోత్సవాలు ముగియనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా లెనిన్ జయంతి..



వైరాలో లెనిన్ చిత్రపటం వద్ద అభివాదం చేస్తున్న నాయకులు

వైరా: సోవియట్ విప్లవ వీరుడు ఐవి లెనిన్ జయంతి వేడుకలు సోమవారం వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదే విధంగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో లెనిన్ జయంతి వేడుకలు నిర్వహించి ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయన సూచించిన అధ్యయన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పుప్పాల నాగరాజు, వేమూరి అజయ్, హేమంత్, గణేష్ పాల్గొన్నారు.